# అదికథ - ఇదిజీవితం

ప్రతాప రవిశంకర్

**ఈశ్వర్** పందు మొదట్లోనే రిక్షా దిగాడు. అతనికి ఆ వీధి మధ్యన ఒక డాబా ముందు పెళ్ళి పందిరి కనిపించింది. బాగ్‌ను భుజానికి తగిలించు కుని ముందుకు నడిచాడు.

పందిట్లో దీపాలు వెలుగుతున్నాయి. కొంతమంది చిన్న పిల్లలు పరుగులు తీస్తూ ఆడుకుంటున్నారు.

గేట్లో నించి లోపలకు వస్తున్న ఈశ్వర్‌ని చూసి, "ఏంరోయ్, మహా రచయితా!నువ్వుకూడా ఇప్పుడా రావటం" అన్నాడు పెళ్ళికొడుకు నిరంజనం.

అప్పటికే పెళ్ళికి వచ్చిన వాళ్ళంతా ఈశ్వర్‌ని చుట్టుముట్టారు.

లోపల ఎక్కడో ఉన్న వాళ్ళందరికీ కూడా రచయిత ఈశ్వర్ పెళ్ళికి వచ్చాడన్న విషయం తెలిసిపోయింది. వాళ్ళంతా గబగబా బయటకు వచ్చారు అతన్ని చూట్టానికి.

ఈశ్వర్ వాళ్ళందరూ తనని అలా చూడటం గమనించి కొంచెం ఇబ్బంది ఫీలయ్యాడు.

ఎవరో పధ్నాలుగేళ్ళ అమ్మాయి ఈశ్వర్ కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళు తీసుకువచ్చి ఇచ్చింది.

పెళ్ళికొడుకు ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు ఈశ్వర్. మాట్లాడు తున్నాడు.

"నువ్వు నిన్ననే వస్తావని అను కున్నాను" అన్నాడు నిరంజనం.

"సెలవు దొరకలేదు. నిన్నటి వరకు ఇన్‌స్పెక్షన్ జరుగుతూనే ఉంది." ఈశ్వర్ అన్నాడు.

ఇంతలోనే ఎవరో ఒకతను వచ్చాడు, "నమస్కారం, ఈశ్వర్‌గారూ" అంటూ.

అతనెవరో ఈశ్వర్‌కి తెలీదు. ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు.

"నా పేరు జనార్దన్. పెళ్ళికి వచ్చాను. నేను కాకినాడలో బి. ఎ. ఫైనలియర్ చదువుతున్నాను" అన్నాడతను.

అతనితో కరచాలనం చేశాడు ఈశ్వర్.

"మీరు ఈ పెళ్ళికి వస్తారని నాకు తెలుసు. అందుకే నేను ముఖ్యంగా మిమ్మల్ని కలుసుకోవచ్చని వచ్చాను" అన్నాడు జనార్దన్.

పెళ్ళికొడుకు చెల్లెలు సునీత గ్లాసుతో కాఫీ తీసుకువచ్చి ఈశ్వర్‌కి ఇచ్చింది. జనార్దన్‌కుకూడా ఇవ్వబోతే అతను తీసుకోలేదు.

జనార్దన్ గబగబా మాట్లాడటం మొదలు పెట్టాడు. నిరంజనాన్ని ఎవరో పిలిచారు లోపలినించి. అతను మళ్ళీ వస్తానని వెళ్ళిపోయాడు.

"ఇప్పుడు 'మందార' మాసపత్రికలో వస్తున్న మీ సీరియల్ నవల 'చీకట్లో చీకటి' వదలకుండా చదువుతున్నాను. అది నా కెంతో నచ్చింది, ఈశ్వర్‌గారూ" అన్నాడు జనార్దన్.

"థాంక్స్" అన్నాడు ఈశ్వర్.

అతనికి ఇబ్బందిగా ఉంది. అలా నలుగురిలో ఎవరయినా తన రచనల గురించి మాట్లాడటం అతనికి ఇష్టం ఉండదు.

ఈశ్వర్ కాగితాల మీద ఎంతయినా వ్రాయగలడు. కాని రచనల గురించి నలుగురిలో మాట్లాడాలంటే బాగా ఇబ్బంది పడతాడు.

జనార్దన్ ఇదంతా గమనించకుండా రచనల గురించి ఏవేవో ప్రశ్నలు వేస్తున్నాడు.

ఈశ్వర్ దిక్కులు చూస్తున్నాడు. ఉన్నట్టుండి అతని దృష్టి గుమ్మం దగ్గర నిలబడి తననే గమనిస్తున్న ఒక అమ్మాయి మీద పడింది. అతను చూడగానే ఆ అమ్మాయి చిన్నగా నవ్వింది.

కొంచెం కలవరపడ్డాడు ఈశ్వర్.

జనార్దన్ ఈశ్వర్ మనస్సు సరిగా లేదని గ్రహించాడు. అందుకే అతను "కొంచెం పనుంది. మళ్ళీ వస్తాను"



అని అక్కడి నుంచి బయటకు వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళగానే గాలి పీల్చుకున్నాడు ఈశ్వర్.

అప్పుడప్పుడు ఇంటి ముందు రిక్షాలు, ఆటోలు ఆగుతున్నాయి. ఎవరెవరో దిగుతున్నారు. వాళ్ళలో ఈశ్వర్‌కి తెలిసినవాళ్ళు అతన్ని పలకరించి లోపలకు వెళ్ళుతున్నారు.

మర్రోజు ఉదయం పెళ్ళి. అందుకే కొంత మంది రాత్రికి చేరుకుంటున్నారు.

మెరుపు తీగలా ఉన్నట్టుండి ఆ అమ్మాయి ఈశ్వర్ ముందు ప్రత్యక్షమయింది. ఆమె నవ్వుతోంది.

"నమస్తే... నా పేరు లావణ్య" అన్నది.

అతను ప్రతినమస్కారం చేశాడు.

జనార్దన్ అంతకుముందు కూర్చున్న కుర్చీలో కూర్చుంది లావణ్య.

"నేను మీ అభిమానిని" అన్నది.

"థాంక్స్" అన్నా డతను చిన్నగా.

ఆమె కళ్ళు అతన్నే సూటిగా చూస్తున్నాయని ఈశ్వర్ గ్రహించాడు.

"కథలు వ్రాసేవాళ్ళంటే నాకు ఎంతో ఇష్టం" అన్నది లావణ్య ఉన్నట్టుండి.

"ఎందుకో, అన్నాడు ఈశ్వర్ మామూలుగా.

"ఎందుకంటారా? వాళ్ళ కల్పనా శక్తికి. సరిగ్గా ఈ విషయంలోనే మామూలు మనిషినించి ఒక రచయిత వేరవుతాడు. అసలు మీరు ఇన్ని కథలను ఇంత బాగా ఎలా వ్రాయగలుగుతున్నారో? నేనయితే రెండు కాగితాలు కూడా పోపిగ్గా రాయలేను" అన్నది.

చిరునవ్వు నవ్వాడు ఈశ్వర్.

అతనికి ఈ మాటలు అంత కొత్తగా అనిపించలేదు.

ఈశ్వర్ కథలుఎక్కువగానే వ్రాస్తాడు. అసలు రోజూ అయిదారు పేజీలయినాకథో, నవలో వ్రాయకుండా అతను నిద్రపోడు. మనుషులందరూ రోజూ పళ్ళు తోముకోవటం, స్నానం చెయ్యటం ఎంత సహజమో, రచయిత అయిన మనిషి రోజూ కొన్ని పేజీలయినా ఏదో ఒకటి వ్రాయడంఅంతసహజమైన విషయమని ఈశ్వర్ ఉద్దేశం.

ఈశ్వర్ కథలు నెలకు మూడు, నాలుగయినా రకరకాల పత్రికల్లో అచ్చవుతూ ఉంటాయి. అతను అన్ని రకాల కథలూ వ్రాస్తాడు. అందుకే అతనికి పాఠకులు ఎక్కువ. అతను రచయితగా చాలా మందికి తెలుసు. పాఠకుల్లో అతనంటే చాలా మందికి క్రేజు ఉంది.

"మీరు కథ వ్రాసి పేరుపెడతారా? లేక పేరుపెట్టి కథలు వ్రాస్తారా?" అడిగింది లావణ్య.

"రెండూ జరుగుతూనే ఉంటాయి."

"మీరుఎక్కువగాపగలు వ్రాస్తారా? రాత్రిళ్ళు వ్రాస్తారా?"

"రాత్రివేళలోనే వ్రాస్తాను."

"అయితే మీరు రాత్రి ఒంటిగంట వరకూ నిద్రపోరన్న మాట." నవ్వింది లావణ్య.

ఆమె నవ్వు ఎంతో అందంగా ఉందనుకున్నాడు ఈశ్వర్.

తెల్లగా, బొద్దుగా ఉంది ఆమె. నల్లటి కళ్ళు, చిన్న నోరు, పలుచని పెదవులు. చెవులకు పెద్ద పెద్ద రింగులు పెట్టుకుంది.

"మీ కథలుచదువుతుంటే వాటిలో చాలావరకు అవి మీ జీవితంలో జరిగిన సంఘటనలే అని నాకు ఎన్నోసార్లు అనిపించింది. నిజమే నంటారా?"

ఈ ప్రశ్నకు ఈశ్వర్ నవ్వాడు.

"మీ ఊహ కొంతవరకు నిజమే. నా కథల్లో సంఘటనలు చాలావరకు జరిగినవే. అయితే అవి నా జీవితంలో జరిగినవి కాదు. నాకు తెలిసినవాళ్ళ జీవితాల్లో జరిగినవి."

"అలాగా" అన్న దామె.

లావణ్య మాట్లాడుతూ ఉండగానే యాభై ఏళ్ళు ఉన్న ఒకామె లోపల్నించి వచ్చి ఆమెను పిలిచింది.

"మళ్ళీ వస్తాను" అని వెళ్ళిపోయింది లావణ్య.

ఈశ్వర్ వెళ్ళుతున్న ఆమెనే చూస్తూ ఉండిపోయాడు.

ఆమె మొదటి పరిచయంలోనే తనతో అంత చొరవగా మాట్లాడటం గురించి ఆలోచించటం మొదలుపెట్టాడు.

లావణ్య వెంటనే రాలేదు.

పెళ్ళికొడుకు వచ్చాడు.

"సారీ, నీకు తెలియంది ఏముందిరా? పెళ్లికొడుకు అంటే ఒక రోజు రాజు. ప్రతి చిన్న విషయానికీ నా సలహాలు అడిగి ప్రాణం తీస్తున్నారు. నీకు బోర్ కొడుతున్నట్లుంది" అన్నాడు.

ఈశ్వర్ లావణ్య గురించి అడుగుదామనుకున్నాడు. కాని ఎందుకో మళ్లీ అడగలేదు. ఆ అమ్మాయితో మాట్లాడటం అతనికి ఇష్టంగానే ఉంది. ఆమె అందం అతణ్ణి పరవశుడిని చేస్తోంది.

ఇంతలోనే మళ్లీ ఎవరో ముసలాయన హడావిడిగా వచ్చి నిరంజనాన్ని పిలుచుకుని వెళ్లాడు. అతను వెళ్లగానే ఈశ్వర్ ఒక సిగరెట్టు ముట్టించాడు.

లోపలకు వెళుతున్నవాళ్ళు, బయటకు వస్తున్నవాళ్ళు ఈశ్వర్‌ని అదోలా చూస్తు

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేపనముతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరములేదు!
3651 TG



న్నారు.

మళ్ళీ మెరుపులా ప్రత్యక్షమయింది లావణ్య.

"ఏమండోయ్, ఈశ్వర్‌గారూ. మీరు మాకు బంధువులవుతారు" అన్నది వచ్చి కూర్చుంటూ.

"బంధువులా!"

"అవునండీ. మా అమ్మ చెప్పింది" అంటూ ఆ వరసేదో వివరంగా చెప్పింది. తర్వాత "ఇంతకీ మీరు నాకు బావ అవుతారు" అన్నది.

"భోజనాలు సిద్ధం అవుతున్నాయి. మీరు ఈ బట్టలు విప్పి లుంగీ కట్టుకోండి" అన్నది.

ఈశ్వర్ మాట్లాడలేదు.

లావణ్య మాట్లాడటం మొదలు పెట్టింది కథల గురించి.


"మీరు అన్నీ ప్రేమకథలే వ్రాస్తారు. ఎందుకండీ, బావగారూ" అన్నది.

ఆమె అలా 'బావగారూ' అనగానే ఆశ్చర్యపోయాడు ఈశ్వర్. 'ఇంత చొరవా' అనుకున్నాడు.

'తనతో ఈ అమ్మాయి పరిచయం ఎంత?' అనుకున్నాడు.

"చెప్పండి" అన్నది.

"ఏముంది?" నాకింకా పెళ్లి అవక పోవడమే" అన్నాడు చిరునవ్వుతో.


చిత్రం— రాంపా

సిగ్గు పడింది లావణ్య.

ఆ తర్వాత భోజనాలకు పిలుపు వచ్చింది.

లుంగీ కట్టుకున్నాడు ఈశ్వర్.

పెళ్లి జనం బాగానే వచ్చారు.

భోజనాలప్పుడు జనార్దన్ వచ్చాడు. వచ్చి ఈశ్వర్ పక్కనే కూర్చున్నాడు. లావణ్య ఈశ్వర్ ఎదురుగా కూర్చున్నది. భోజనం చేస్తున్నంతసేపూ అతన్ని చూసి నవ్వుతూనే ఉన్నది.

భోజనా లయినాయి.

ఈశ్వర్‌కి పక్కపాడి తీసుకొచ్చి ఇచ్చింది లావణ్య. ఇస్తూ "ఇంకా పది కాలేదు, సెకెండ్‌షో సినిమాకు వెళదామా, రచయిత బావగారూ" అన్నది.

వెంటనే ఏం చెప్పాలో తెలీలేదు ఈశ్వర్‌కి.

లావణ్యతో సినిమాకు వెళితే ఎలా ఉంటుంది?

బాగుండదు. నలుగురూ ఏమనుకుంటారు? అనిపించింది.

ఇద్దరికీ పరిచయమయి నాలుగు గంటలు కూడా కాలేదు.

తన ఇమేజి దెబ్బ తింటుంది.

"సారీ, నాకు నిద్ర వస్తూంది. రాత్రి కూడా నిద్ర లేదు" అన్నాడు.

"సర్లేండి, అయితే. డాబామీద పక్క వేస్తాను. పడుకోండి" అన్నది.

"వద్దులెండి. మీ కెందుకు శ్రమ" అన్నాడు ఈశ్వర్.

"ఫర్వాలేదు. మీరు నా అభిమాన రచయిత. అంతే కాదు, మా బావగారు" అన్నది నవ్వుతూనే.

ఆ తర్వాత అయిదు నిమిషాలకు ఈశ్వర్ డాబామీదకు వెళ్లి పడుకున్నాడు. జనార్దన్ కూడా అతని వెనుకే పైకి వెళ్లాడు. లావణ్య రాలేదు.

"ఈశ్వర్‌గారూ! నేను ఈ మధ్య రెండు కథలు వ్రాశాను. ఆ రెండింటినీ రెండు వార పత్రికలకు పంపించాను. నెల రోజుల్లోపలే తిరిగి వచ్చాయి. ఎందువల్లనంటారు? కథలు బాగా ఉన్నాయని చాలా మంది చదివిన వాళ్ళు చెప్పారు" అని అడిగాడు ఈశ్వర్‌ని జనార్దన్.

"ఎందువల్లనంటే ఎలా చెప్పగలం? ఆ కథలు ఇంతకుముందు ఎవరో వ్రాసేసి ఉండొచ్చు. సబ్జెక్టు బాగా పాతదయినా కథలు తిరిగొస్తాయి. కథలు తిరిగొచ్చాయని బాధ పడకండి. ఇప్పటికీ నా కథలుతిరిగొస్తాయిఅయినా వ్రాయటమే" అన్నాడు ఈశ్వర్ పడుకుని.

"మీరు డైరెక్టుగా ఫెయిర్ వ్రాస్తారా?" అడిగాడు.




SWATHI*

వినూత్న సాంప్రదాయానికి నాంది

"స్వాతి"

- సర్వోన్నతమైన నాణ్యత
- సర్వోన్నతమైన పనితనం
- సర్వోన్నతమైన సుందరరూపం

దేశంలో 7 సం॥లు గ్యారంటీతో లభించే ఒకే ఒక కుట్టుమిషన్ మీ ఇంటికే అలంకారం.

SWATHI SEWING MACHINE COMPANY, SEETHARAMA PURAM, ELURU ROAD, VIJAYAWADA - 520004.

DEALAR SHIP ENQUIRIES SOLICITED



మీ తెలివితేటలు ఉపయోగించుకోండి
బహుమతులను గెలవండి

1వ బహుమతి
రు. 2,000
నగదు
ఇంకా ఇతర
ఆకర్షణీయమైన బహుమతులు

2వ బహుమతి
టేప్ రికార్డర్ లేదా
రు. 1000 నగదు

3వ బహుమతి
పుస్తకాలు లేదా
జపాన్ మోడల్
ట్రాన్సిస్టర్
(సగం ధరకు)



ఢిల్లీ న్యాయపాలనా పరిధికి లోబడి ఉంటుంది. EXAMPLE

| | | | | |
|---|---|---|---|---|
| 2 + | 17 + | 14 + | 5 = | 38 |
| 12 | 7 | 8 | 11 | |
| 9 | 10 | 13 | 6 | |
| 15 | 4 | 3 | 16 | |

మీరు చేయవలసింది నమూనాలో చూపించిన విధంగా తెల్ల కాగితం మీద పదహారు ఖాళీ గళ్ళు తయారు చేయండి నిలువుగా, అడ్డంగా, వాలుగా కూడితే మొత్తం 42 (నలభై రెండు) వచ్చేందుకు విలుగా 3 (మూడు) నుంచి 18 (పద్దెనిమిది) వరకు అంకెలను వాడండి ఈ అంకెలను ఒకసారి మాత్రమే వాడాలి. ఫలితం తెలిసిన వెనువెంటనే. పోస్టేజి. పేకింగ్ ఖర్చులకు డబ్బు డిపాజిట్ చేయవలసిందిగా విజేతలకు తెలియపరుస్తాము. ఒక కుటుంబం నుంచి ఒక్క ఎంట్రీ మాత్రమే స్వీకరిస్తారు మొట్టమొదటగా అందిన ఎంట్రీకి రు. 101/- నగదు బహుమతి ఇస్తారు. ఈ ప్రకటన వెలువడిన 15 రోజులలోగా ఎంట్రీలు అందాలి

NATIONAL BOOKS (TL) East Park Road, Karol Bagh, New Delhi-5.

"అవును. చాలావరకు అంతే. ఎప్పుడయినా బాగా రాలేదనుకుంటే దాన్ని మళ్ళీ వ్రాస్తాను."

అలా జనార్దన్ ఈశ్వర్‌తో పదకొండు గంటలవరకూ మాట్లాడి, చివరికి ఈశ్వర్‌కి నిద్ర రావడం గమనించి కిందికి వెళ్ళిపోయాడు 'గుడ్‌నైట్' చెప్పి.

క్రమంగా ఈశ్వర్ లావణ్య గురించి ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడు.

ఈశ్వర్ పెళ్ళి కొడుకు నిరంజనానికి మంచి స్నేహితుడే కాకుండా బంధువు కూడా అవుతాడు. సాధారణంగా ఈశ్వర్ పెళ్ళిళ్ళకు దగ్గరివాళ్ళు ఎవరయినా పిలిస్తే మిస్సవకుండా వస్తూనే ఉంటాడు. ప్రతి పెళ్ళిలోనూ కథ వ్రాసుకోటానికి పనికి వచ్చే సంఘటన ఏదో ఒకటి జరుగుతుందని ఈశ్వర్ నమ్మకం. అలా పెళ్ళిళ్ళకు వెళ్ళి అతను వ్రాసిన కథలునాలుగయిదుఅచ్చయినాయి. ప్రస్తుతం అతని కథా వస్తువుకు మూలం లావణ్య అనుకున్నాడతను.

ఒక రాత్రివేళ ఈశ్వర్‌కు మెలకువ వచ్చింది. డాబా మీద చీకటిగా ఉంది. ఎవరో అతని చేతి మీద చెయ్యి ఉంచి చిన్నగా నొక్కుతున్నట్టు అనిపించింది.

చిన్నగా లేచి కూర్చున్నాడు. చెయ్యి గబుక్కున వెనక్కి వెళ్ళిపోయింది. డాబా మీద చిందర వందరగా చాలా మంది పడుకున్నారు. నక్షత్రాల వెలుగులో తనకు కొంచెం దూరంలో పడుకున్న మనిషిని చూసి ఆశ్చర్యపోయాడు.

ఆమె లావణ్య!

చిన్నగా నవ్వుకున్నాడు అతను.

ఆమె నిద్రపోతున్నట్టు నటిస్తూంది.

మళ్ళీ పడుకున్నాడు అతను. కాని నిద్ర పట్టలేదు.

అతని ఆలోచనల నిండా ఆమే.

తెల్లవారింది.

మామూలు చిరునవ్వుతోనే ఈశ్వర్ వెంటే తిరుగుతూ, అతని అవసరాలన్నీ అడక్కుండానే తీర్చింది లావణ్య. ఆమె ఈశ్వర్ విషయంలో తీసుకుంటున్న శ్రద్ధను కొంతమంది గమనించారు.

నిరంజనం అడిగాడు—"ఏంరోయ్, మహా రచయితా ఇద్దరూ పెళ్ళి చేసుకోబోతున్నారా" అని.

నవ్వాడు ఈశ్వర్. మాట్లాడలేదు.

పెళ్ళి జరిగిపోయింది.

ఆ సాయంత్రం బజారుకు వెళ్ళి వచ్చి డాబా మీద కూర్చున్నాడు ఈశ్వర్ ఒంటరిగా. . .

కింద మేజువాణి జరుగుతూంది.

అతను వెళ్ళిన అయిదు నిమిషాలకు డాబా మీదకు వచ్చింది లావణ్య అతనికి పక్కగా నిలబడింది వచ్చి.

"మీరు రేపు కూడా ఉంటారా బావగారూ" అన్నది.

"లేదు. రేపు ఉదయమే వెళ్ళిపోతాను." చెప్పాడు ఈశ్వర్.

"ఏ మంచిరోజు చూసుకుని మా అమ్మ మీ వూరు రావాలని అనుకుంటున్నది" అన్నది ఆమె.

"మా వూరు రావటానికి మంచిరోజు కావాలా?" నవ్వుతూ అడిగాడు.

"అవును. పెళ్ళి మాటలు మాట్లాడడానికి వచ్చేటప్పుడు మంచిరోజు అవసరం లేదూ?"

"పెళ్ళి మాటలా?"

"అవును. . .నా పెళ్ళి గురించి." సిగ్గు పడింది లావణ్య. తల వంచుకుంది.

లావణ్య ఆంతర్యం ఈశ్వర్‌కి అర్థమయింది.

తల వంచుకునే అన్నది లావణ్య కొంచెంసేపటి తర్వాత: "నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను, ఈశ్వర్‌గారూ."

ఈశ్వర్ మాట్లాడలేదు. చాలాసేపు మవునంగానే ఉండిపోయాడు.

చీకటి బాగా చిక్కబడింది.

ఎవరో కింద మేజువాణి పాట పాడుతున్నారు.

"మీరు బాధ పడనంటే మీ కో విషయం చెబుతాను. క్షమించండి. నేను మాట్లాడే మాటలు మీకు తప్పకుండా బాధనే కలిగిస్తాయి. అయినా చెప్పక తప్పదు. నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోలేను. కొన్ని గంటల పరిచయం లోనే నాపట్ల మీ ప్రవర్తన నాకు మీమీద చిన్న చూపునే కలిగించింది. అంతగా పరిచయం లేని మగాడిని సినిమాకు రమ్మని అడగటం, రాత్రి పూట చేతిమీద చెయ్యి వేసి నొక్కటం... మీమీద నాకుఎటువంటి అభిప్రాయాన్ని కలిగించాయని అనుకుంటున్నారు? రచయితననీ, కథల్లో వ్రాసినట్టు గానే అందమైన అమ్మాయి అందుబాటులో ఉంటే ప్రేమిస్తాననీ అనుకున్నారనుకుంటాను. నిజమే. . . ఉదాహరణకి ఈ సంఘటననే కథగా వ్రాస్తే చివర్లో మనిద్దరికీ పెళ్ళి జరిగినట్లుగానే వ్రాస్తాను. ఎందుకంటే, అది కథ; ఇది జీవితం. . .మీవంటి ప్రవర్తన కలిగిన ఆడదాని నేను భరించలేను. . . రచయితనైనా నేనూ మనిషినే. . . క్షమించండి" అని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు ఈశ్వర్.

శిలలా చీకట్లో ఆ డాబా మీద ఒంటరిగా నిలబడిపోయింది లావణ్య. ★


మెజెస్టిక్®

ప్రెషర్ కుకర్‌లో మాత్రమే పదార్థం పొంగిపోయే అవకాశం ఇవ్వని గిన్నెలు ఉంటాయి.

వేసిన పదార్థం ఇకమీదట ఏమాత్రం పొంగదు. చుట్టు క్షుణ్ణంగా మూసి వుండే వైరు స్టాండువల్ల ఎంతో సదుపాయం కలుగజేయ బడింది. వండుకోవడానికి ఎక్కువ ఖాళీ స్థలం వుంటుంది. ఒక్కసారి క్రిందకు దింపడంగాని, పైకి లేవనెత్తిగాని చూస్తే, ఇతర ప్రెషర్ కుకర్లలో లేని ఎంతో అద్భుతం మీకు కనిపిస్తుంది. స్టెయిన్‌లెస్‌స్టీలు లేక అల్యూమినియం పాత్రలు-ఏవైనా మీరు ఎంచుకో వచ్చును.




- ఐ.ఎస్.ఐ. ప్రమాణాలకు సరిపోయే విధంగా వేయబడినవి.
- శాశ్వతంగా ఉండేందుకు ఒత్తిడికి లోనుచేసి ఆకారం రూపొందించ బడింది.
- 4 నుంచి 12.5 లీటర్ల పరిమాణాలలో 7 సైజులలో లభిస్తుంది.




© మెజెస్టిక్®

ప్రెషర్ కుకర్

ఎంతో బాగా పనిచేస్తుంది- చిరకాలం మన్నుతుంది.

ఆం.ప్ర పంపిణీదారులు :

మహావీర్ ఎంటర్‌ప్రైజెస్

తిలక్‌రోడ్, హైదరాబాదు, ఫోన్ : 34819